# శిశిర వసంతం

నవల



స్వాతి శ్రీపాద

# 1

**"ఫో**న్ కూడా చెయ్యకుండా ఇంత సడెన్‌గా..'' తల్లిని మధ్యలోనే ఆపేస్తూ,

''అమ్మా, ఒక సర్‌ప్రైజ్ నీకోసం ...'' అంటూ వెనక్కు తిరిగి ఒకడుగు వెనక్కు వేసి పిలిచాడు ''నిర్మలా రా''.

బెరుకు బెరుగ్గా ముందుకు వచ్చింది నిర్మల అని పిలవబడ్డ ఆ అమ్మాయి.

''అమ్మా నీ కోడలు. నాతో పాటు పనిచేస్తాడు చూడు విస్సిగాడు అదే విశ్వనాధం, ఒకటి రెండు సార్లు మనింటికి వచ్చాడు కూడా, వాడి చెల్లెలు. పెళ్లిలో పెళ్ళికొడుకు అసలు రంగు బయట పడింది. వాడికి ఇది ఆరో పెళ్లి అట. తల్లీకొడుకూ బెంగ పడిపోతే నేను ధైర్యం చెప్పేలోగా ఈ పిల్ల అవమానం భరించలేక... సరేలే అవన్నీ తరువాత... నేను తాళి కట్టి తీసుకు వచ్చా'' చెప్పాల్సింది అయిపోయినట్టు ఆగిపోయి లోపలకు వెళ్ళబోయాడు మల్లిక్ అని పిలువబడే మల్లికార్జున్.

అతడికి అడ్డం వచ్చి ఆపుతూ, ''ఒక్క నిమిషం రా చిన్నా'' అంటూ వెనక్కు తిరిగి, ''ఒసే సుబ్బలక్ష్మి కొంచం దిష్టి నీళ్ళూ హారతి తెస్తావూ'' అని ''నీకు చెప్పే కన్నా నేను చేసుకోడమే నయం, ఒక్క నిమిషం ఇక్కడే ఆగండి'' అంటూ గబగబా లోపలి వెళ్ళింది.

మల్లిక్ నిర్మల వంక చూపు తిప్పాడు. నలిగిపోయిన జరీ అంచు పసుపు అంటిన తెల్లచీర రేగిపోయిన జుట్టు, మొహాన రంగు వెలసినట్టున్న కళ్యాణం బొట్టు, రాత్రంతా బస్‌లో ప్రయాణం వల్ల కనిపించే అలసట...

నిజానికి ఇదివరకు విస్సిగాడి ఇంటికి వెళ్ళినప్పుడు అయిదారు సార్లు ఆమెను చూసాడు, ఒకటో రెండో మాటలూ సాగి ఉంటాయి. నీళ్ళో కాఫీయో ఇచ్చేది కూడా.

విశ్వనాథం, నిర్మల ఇద్దరూ నెమ్మదైన వారే. సరస్వతి వారి తల్లి. సహజంగా శాంత స్వభావం, మెత్తని మాట లౌక్యం తెలియని మనిషి. ఇంటికి మగదిక్కు లేకున్నా, పెద్ద ఆస్తిపాస్తులు లేకున్నా మంచితనంతో, పరోపకార స్వభావంతో రోజులు నెట్టుకొస్తోంది.

మల్లిక్ పని వెతుక్కుంటూ అక్కడికి ఆ చిన్న టౌన్‌కి వెళ్ళిన కొత్తలో విశ్వనాథం వీలైనంత సాయపడ్డాడు.

నిజానికి ఇద్దరికీ పూర్వ పరిచయమేమీ లేదు. బస్ టికట్టు చాలా ఖరీదని ట్రైన్లో వెళ్ళినప్పుడు ఒకే కంపార్ట్‌మెంట్‌లో ఒకరికొకరు తారసపడ్డారు. ఇద్దరూ పక్క పక్కనే కూర్చున్నారు.

దార్లో ఎక్కడో ట్రైన్ ఆగినప్పుడు కాల్చిన మొక్కజొన్న కండె కొని దాన్ని పక్కనున్న మల్లిక్‌కి ఇచ్చాడు

''అబ్బే''

''ఫర్వాలేదు నాలుగ్గింజలు అంతేగా.''

మొహమాటంగా అందుకున్నాడు. మాటలు కలిసాయి. పేర్లు తెలుసు కున్నారు.

వివరాలు పంచుకున్నారు.

''ఇక్కడ ఎవరైనా తెలిసిన వారున్నారా?'' విశ్వనాథం అడిగాడు.

''లేరు. ఎక్కడ ఉండటమో ఆలోచించాలి. గత ఆర్నెల్లుగా మా ఊర్లో ఎంత ప్రయత్నించినా పనేమీ దొరకడం లేదు. అమ్మ ఎంతకని పోషిస్తది. ఇక్కడ బట్టల మిల్లులో ఉద్యోగాలు దొరుకుతున్నాయంటే ...''

వివరాలు అడిగాడు. అనుమానం వచ్చిన చోట అడిగి తెలుసుకున్నాడు.

అతనూ ఒక బట్టల మిల్లులోనే పని చేస్తానన్న సంగతి చెప్పలేదు.

తెల్లారి రైలు దిగాక.

''కొత్త ఊరు, కొత్త భాష ఎక్కడని పోతావు, పద మనింటికి పోదాం'' అని షేరింగ్ ఆటో ఎక్కించి తనవెంట తీసుకెళ్ళాడు.

మల్లిక్‌కి అయోమయంగా వుంది. ఏమైనా అనుమానించాలన్నా తన దగ్గర ఉన్నదేమీ లేదు.

కాస్త దూరంగానే చిన్న ఇంటిని సమీపించాక చెప్పాడు ''అమ్మా, నేనూ చెల్లీ ఉంటాము. అమ్మ రెడీమేడ్ డ్రెస్‌లు కుడుతుంది.చెల్లి ఇంటర్ ఫెయిలయి ఇంట్లోనే ఉంటది. దానికి కాస్త గారమెక్కువ.

పెరిగిన పిల్లుందని నిన్ను ఇంట్లో ఉంచుకోలేము. అయినా ఏదోక ఏర్పాటు చూద్దాం. ముందైతే కాస్త తిని మిల్లుకి వెళ్దాం.''

''మిల్లుకా?''

''అవును, నేను మిల్లులోనే పనిచేస్తా...''

ఈలోగా తలుపు తట్టి తలుపు తీసిన తల్లికి చెప్పాడు ''అమ్మా మల్లిక్‌కి కూడా కాఫీ'' అంటూ తనవెంట చిన్న గదిలోకి తీసుకు వెళ్ళాడు.

ఇద్దరూ బట్టలు తీసుకుని పెరట్లోకి వెళ్ళారు.

బావి గట్టున మొహం కడుక్కుని స్నానాలు కానిచ్చి వచ్చే సరికి అతని తల్లి రెండు గ్లాసులతో కాఫీ పట్టుకు వచ్చింది.

''మా అమ్మ సరస్వతి. అమ్మా ఇతనూ మన మిల్లులోనే పనికి వచ్చాడు. సాయంత్రం వచ్చేలోగా మనకు దగ్గరలో ఒక చిన్న గది చూడు. ఈ రోజు ఇద్దరం బయట తినేయ్యమా?'' అడిగాడు,

''ఎందుకు? రొట్టెలు రెడీగా వున్నాయి'' అంటూ రెండు డబ్బాల్లో లంచ్ కట్టి ఇచ్చిందామె.

ఎవరు ఏమిటి అని కూడా అడగలేదు.

''మాది సిరిసిల్ల, మగ్గాలు నడవక బాపు అప్పులు దీర్చలేక ఇల్లొదిలి పారిపోయాడు. అమ్మ ఉన్న ఊర్లో కాయకష్టం చెయ్యలేక పట్నం మారినం. పట్నంల చిన్న షాప్ ఉన్నది. అక్కలిద్దరు. పెళ్ళిళ్ళు అయినాయి, మేం సాలోళ్ళం'' ఏ మాత్రం భేషజం లేకుండా చెప్పాడు మల్లిక్.

''మనం మనం ఒకటే నాయె. మేమూ నేతగాల్లమే. అది నడవక పొలం దున్ని అదీ ఎక్కి రాక ఉన్నకాడికి అన్నీ అమ్ముకుని ఇక్కడికి వచ్చేసాడు నాన్న.

కాని వచ్చిన అయిదారేళ్ళకే జబ్బు బారిన పడ్డాడు. జీవితమన్నాక కష్టాలూ సౌఖ్యాలూ మామూలేగా.''

విశ్వనాథం మల్లిక్‌ను వెంట పెట్టుకు వెళ్లి తన దూరపు చుట్టమని చెప్పడమే కాక వెంటనే పని కూడా ఇప్పించాడు. తల్లితో మాట్లాడి ఇంటికి దగ్గరలో తక్కువ అద్దెలో ఒక చిన్న గది కూడా ఏర్పాటు చేశాడు.

వారం రోజుల వ్యవధిలో కొంత వంట సామాను కొనిపించి వంట చేసుకునే ఏర్పాటు కూడా చేశాడు.

మల్లిక్‌కి సిగ్గనిపించింది.

ఇంట్లో ఇద్దరక్కలు ఉండటం వల్ల ఎప్పుడూ పెద్దగా పని అలవాటు లేదతనికి. కాని విశ్వ నాథం అలా కాదు ఉదయం తల్లితో పాటే లేచి బావిలోంచి రోజంతటికీ కావలసిన నీళ్ళు తోడి సిమెంట్ గంగాళాలు రెండు నింపి పెడతాడు. తల్లి గిన్నెలు తోమితే కడిగి మళ్ళీ నీళ్ళతో తొలిచి బోర్లిస్తాడు.

తల్లి కాఫీలు చేసి ఇచ్చేలోగా ఒక పొడి గుడ్డ తీసుకు గిన్నెలు తుడిచి లోనికి తెస్తాడు.

ఆవిడ స్నానం చేసి వచ్చేలోగా దొడ్లో కూరలు తెచ్చి కోసి పెడతాడు. పెరట్లో తోట కూర తెచ్చి సన్నగా తరగటం చూస్తే ముచ్చట వేసింది.

నిర్మల మాత్రం ఆలస్యంగా నిద్రలేస్తుంది.

అయినా తల్లీ, అన్నా వెళ్ళిపోయాక బట్టలుతికి ఆరేసి పుస్తకాలు చదువుకోడమో, తనీడు వాళ్ళతో సినిమాలు చూడటమో చేస్తుంది. మనసు పుడితే సాయంత్రానికి వంట చేసి పెడుతుంది.

''ఇంటర్ తరువాత టైలరింగ్ డిప్లొమా చేసింది కాని మేము బలవంత పెట్టము. రేపు పెళ్ళయి పరాయింటికి వెళ్ళే పిల్ల. ఇక్కడున్నన్ని రోజులైనా సరదాగా ఉండనీ.

ఇప్పుడు సంపాదన ఉందని తెలిసి సంబంధాలు వస్తే రేప్పొద్దున దాని సంపాదనకు ఆశపడతారు. అలా వద్దు.''

నిజమే అనిపించింది.

ఉద్యోగంలో కుదురుకుని ఇంటికి డబ్బు పంపడం మొదలెట్టాడు.

వంట పనీ ఇంటి పనీ నెమ్మదిగా అలవాటయింది.

మొదట్లో చేతులు కాల్చుకోడం, కూరలు కోస్తే వేళ్ళు తెగడం, అబ్బో ఇది నా వల్ల కాదు అని చాలా సార్లే అనుకున్నాడు. కాని విశ్వనాధం పక్కన ఉండి మెళకువలు నేర్పాడు.

అలాగని వెంటేసుకుని ఇంటికి తీసుకెళ్ళే వాడు కాదు. అయినా ఇంట్లో మనిషిలా అన్నీ చెప్పి సలహాలు తీసుకునేవాడు, సలహాలు ఇచ్చేవాడు కూడా.

ఎప్పుడయినా ఒంట్లో బాగోకపోతే దగ్గరుండి చూసుకునేవాడు.

చూస్తూండగానే గిర్రున మూడేళ్ళు తిరిగి పోయాయి. మధ్యలో ఇంటికి వచ్చినప్పుడు ఒకటి రెండు సార్లు విస్సిగాడిని కూడా తీసుకు వచ్చాడు, ఆ వంకన చెల్లెలి కేమైనా మంచి సంబంధం చూడొచ్చని అతనూ ఆశపడ్డాడు.

వచ్చినప్పుడల్లా తల్లికి ఇంటా బయటా సాయపడటం కొత్తగా అలవాటు చేసుకున్నాడు.

విశ్వనాధం చెప్పి చూసాడు, ''అమ్మను తెచ్చేసుకోరాదూ''

''లేదు రా, ఇద్దరక్కలూ ఇక్కడే కదా, అందులో పెద్దక్క సంసారం అంత బాగాలేదు. అమ్మ అక్కడుంటే ఆసరా, అదీ గాక షాప్ బాగా నడుస్తోంది.''

అతను మరిక రెట్టించలేదు.

విశ్వనాధమూ నిర్మలకు పెళ్లి చేసెయ్యాలనే ధ్యాసలోనే ఉన్నాడు. ఇరవై రెండేళ్ళు. దాని పెళ్లి చేస్తే గాని తన పెళ్లి తలపెట్ట దలచుకోలేదు.

నిర్మల శాంతం చూసాక ఒకటి రెండు సార్లు మల్లిక్‌కి అనిపించింది, పోనీ తను అడుగుదామా అని.

కాని చెల్లెలి భవిష్యత్తు పట్ల ఎన్నో ఆశలున్నాయి అతనికి. చదువుకుని ఉద్యోగంలో ఉన్న వాడికి ఇవ్వాలనీ, చెల్లెలు మళ్ళీ వెనక్కు తిరిగి చూడకుండా జీవితాన్ని అమర్చాలనీ.

''నిజమే, నా దగ్గర ఏం ఉంది? ఇప్పుడిప్పుడు కదా బాపు చేసిన అప్పులు

దీరాయి. అయినా అక్కలిద్దరూ ఇంకా దానికో దీనికో పుట్టింటి మీద ఆశ పడుతూనే ఉంటారు.

పెద్దక్క పెళ్ళయి ఇరవై ఏళ్ళు. అక్కకే పద్దెనిమిదేళ్ళ కూతురుంది. ఆ వెనక మరో ముగ్గురు. చిన్నక్క చీటికీ మాటికీ వచ్చి కల్లబొల్లి ఏడుపులేడ్చి అన్నీ అమ్మ దగ్గర వసూలు చేస్తుంది. ఏం సుఖపెట్టగలడు గనక?''

అలా అనుకుని నోరు మెదపలేదు.

చివరికి మంచి సంబంధం కుదరనే కుదిరింది.

పిల్లవాడు శ్రీనివాస్‌కి గవర్నమెంట్ ఆఫీస్‌లో మంచి ఉద్యోగం. సూటూ బూటు వేసుకుని దొరబాబులా ఉన్నాడు. ఇద్దరూ అతని వెనక వెళ్ళి ఆఫీస్‌లో వాకబు చేసి వచ్చారు. చదువు గురించీ ఉద్యోగం గురించీ ధృవపరచుకున్నారు.

నిర్మల కూడా సుముఖత చూపింది.

బేర సారాలాడి మొత్తం ఐదు లక్షలకు ఒప్పందం కుదిరింది.

పెళ్లి వీలైనంత తొందరలో జరగాలి.

నిశ్చితార్థం వద్దని, అచ్చిరాదనీ పెళ్ళికి తరలి వస్తామనీ చెప్పారు.

ఉన్నంతలో చెల్లెలి సరదాలనీ తీర్చాడు.

నామకహా పసుపు దంచాక పెళ్లి పనులు ఇద్దరూ కలిసే చేశారు.

వీలైనంత తక్కువ మందిని పిలుచుకున్నాడు. బంధువులు పెద్దగా ఎవరూ లేరు.

పెళ్లి పత్రికలూ అచ్చు వెయ్యనే లేదు, గుమ్మాలకు తోరణాలు కట్టి ఇంటి ముందు పందిరి వేశారు.

తెల్లారితే పెళ్ళి.

ఆ రాత్రి ఏడు గంటల వేళ, పిలవని పేరంటంలా వచ్చింది వకుళ. వెంట ఇద్దరు పిల్లలు. ఎవరి వైపు చుట్టమో మొదట ఎవరికీ అర్థం కాలేదు.

ముందుగా అప్పటికే చేసిన బూందీ కాస్త పెట్టి మర్యాద చేశారు, నిదానంగా వివరాలు అడగవచ్చని.

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Sisira+Vasantam+Sripada+Swatee](http://kinige.com/book/Sisira+Vasantam+Sripada+Swatee)**

* * *